


ఉద్యోగ, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి చెల్లించాలి

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్ర ప్రభుత్వం జులై నుంచి ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఐఆర్ (మధ్యంతర భృతి) తక్షణం చెల్లించాలని ఎపిటిఎఫ్-1938 జిల్లా కన్వీనర్ రమణ డిమాండ్ చేశారు. ఎపిటిఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న మూడు డిఎలను విడుదల చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన విద్యుత్ బిల్లులను గ్రామ పంచాయతీలు చెల్లించేలా చూడాలన్నారు. సిపిఎస్ జిల్లా కన్వీనర్ శ్రీవల్లి మాట్లాడుతూ జిఒ 117ను తక్షణం రద్దు చేసి, విద్యారంగానికి వాటిల్లిన నష్టాన్ని నివారించాలని డిమాండ్ చేశారు. జిపిఎస్ విధానాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నరసాపురం మండల బాధ్యులు నాగరాజు, తణుకు మండల బాధ్యులు సత్యసాయి పాల్గొన్నారు.

గాంధీ నడయాడిన నేల ఇదేనా..!

ప్రజాశక్తి - డెస్క్



గాంధీ జయంతిని హింసకు వ్యతిరేకంగా, అహింసకు ప్రతిరూపంగా వాడవాడలా నిర్వహిస్తున్నారు. స్వచ్ఛతకు నిదర్శనంగా గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పాలకులు ఘనంగా చెప్పుకుంటున్నారు. అయితే స్వచ్ఛభారత్, స్వచ్ఛ తా హి సేవ పేరిట గాంధీ జయంతి సందర్భంగా రెండు మూడు రోజులు హడావుడి తప్ప క్షేత్రస్థాయిలో పల్లెలు కంపు కొడుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాతో జాతి పిత మహాత్మగాంధీకి వీడదీయలేని అనుబంధం ఉంది. జాతీయస్థాయిలో స్వాతంత్రోద్యమ కాలంలో ఉప్పు సత్యాగ్రహం విజయవంతమైన పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం భీమవరం రెండో బార్డోలిగా గాంధీచే పిలవబడింది. దక్షిణభారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత ప్రముఖ ఆదర్శ నేతగా నేటికీ అందరిచే పిలవబడే పుచ్చలపల్లి సుందరయ్య ఉద్యమ ప్రస్థానం ఈ జిల్లాలోనే ప్రారంభమైంది. స్వాతంత్రోద్యమ కాలంలో జిల్లాలోని వివిధ పట్టణాల మీదుగా గాంధీ పర్యటన సాగిన సందర్భాలున్నాయి. ఈ క్రమంలో గాంధీ జయంతినాడు మహాత్ముని కలలు జిల్లాలో సాక్షాత్కరించాయో లేదో మనం పరిశీలిస్తే కొంత బాధాకరమైన సమాధానమే వస్తోంది.

నవ్యాంధ్రప్రదేశ్‌లో కొత్త జిల్లాలు ఏర్పడ్డాక జిల్లాలో అనూహ్య రీతిలో నేరాలు పెరిగిపోయాయి. బాలికలపై, మహిళలపై వావీవరసలు మరచి అఘాయిత్యాల పరంగా హత్యలు, మోసాలు అదేస్థాయిలో నమోదవుతున్నాయి. మండవల్లిలో హాస్టల్లో ఉండి చదువుకుంటున్న బాలికను వరుసకు సోదరుడు, అతని పరిచయస్తులే చరబట్టడం.. అలాగే భీమవరం గాంధీనగర్‌లోని బాలికపై చిన్నాన్నే హత్యాచారానికి పాల్పడడం అందరినీ నివ్వెరపరచింది. నిర్భయ, దిశ వంటి చట్టాలతో మహిళల రక్షణకు కట్టుబడి ఉన్నామని పాలకులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితులు లేవనడానికి ఈ సంఘటనలే ప్రత్యక్ష నిదర్శనం. ఇదే సమయంలో పాలకులే హింసకు దిగడం, ప్రజలకు ఎక్కడ, ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితి కనిపిస్తోంది. గడప దాటి బయటకు వెళ్లిన మహిళలు, చిన్నారులు క్షేమంగా ఇంటికి తిరిగి వస్తారో లేదోగాని హక్కులపై ఉద్యమిస్తున్న నేతలు సమస్యలు పరిష్కరించాలని శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ప్రజలు మాత్రం పోలీస్‌స్టేషన్లలోనూ, గృహాల్లోనూ నిర్బంధానికి గురవుతున్నారు. కనీసం గాంధీజీ తెలిపిన శాంతియుత నిరసనలకు సైతం ఈ పాలకులు అనుమతించకుండా గొంతు నొక్కే ప్రయత్నం చేయడం రెండు జిల్లాల్లోనూ కనిపిస్తోంది. గాంధీ వారసులమని చెప్పుకుంటూ ఆ గాంధీని హత్య చేసిన గాడ్సేను కొలిచే పాలకుల విధానాలు ఇందుకు భిన్నంగా ఉంటాయనుకోవడం అవివేకమే. ఇప్పటికైనా గాంధీ వరసులమని చెప్పుకోవడం మాని గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం లక్ష్య సాధన దిశగా హింసను ప్రేరేపించే విధానాలను పాలకులు వీడాలి. అదే సమయంలో ప్రభుత్వ రక్షకులుగా కాకుండా ప్రజారక్షకులుగా పోలీసులను తీర్చిదిద్దే విధానాలు అవలంభిస్తే ఎంతోకొంత గాంధీ కోరుకున్న శాంతి.. పచ్చని పశ్చిమగోదావరి జిల్లాలో కనిపించే అవకాశం ఉంది.

గాంధీ జయంతి సందర్భంగానే స్వచ్ఛభారత్ పేరిట కొంతకాలంగా బిజెపి పాలకులు హడావుడి చేస్తున్నారు. దానికి అనుగుణంగా రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం క్లీన్ ఆంధ్రప్రదేశ్ అంటూ ప్రజలపై చెత్త పన్ను వేసి ఘనతను చాటుకుంది. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా అన్నిచోట్లా పేరుకుపోయిన చెత్త, క్షీణించిన పారిశుధ్యంతో కంపుకొడుతున్నాయి. భీమడోలు, విస్సాకోడేరు వంటి ప్రాంతాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పేరిట కొంత పారిశుధ్యం మెరుగుకు గట్టి కృషి జరుగుతుంది. అయితే ఇవన్నీ వేళ్లపై లెక్కగట్టగలిగిన గ్రామాలే. పట్టణాల్లో ఒక మోస్తరు వర్షం కురిస్తే మురుగునీరు వెళ్లే మార్గం లేక రోడ్లపైకి చేరుతుంది. ఇక గ్రామీణ ప్రాంతాల్లో అయితే గ్రామంలో అడుగు పెట్టేటప్పుడే ముక్కు మూసుకోవాల్సి వస్తోంది. దీనికి ప్రధాన కారణం డంపింగ్ యార్డులు లేకపోవడమే. ఇప్పటికీ చాలా గ్రామాల్లో డంపింగ్‌యార్డుల ఏర్పాటు ప్రతిపాదన దశలోనే ఉన్నాయి. దీంతో పంచాయతీలు సైతం ఏమీ చేయలేక గ్రామ శివార్లలో చెత్తను పారబోస్తున్నాయి. స్వచ్ఛభారత్ అంటే అంతా స్వచ్ఛంగా ఉండాలి తప్ప గాంధీ జయంతి రోజనే ఉంటే సరిపోదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికైనా గ్రామాల్లో డంపింగ్‌యార్డులు ఏర్పాటు చేయడంతో పాటు పంచాయతీలకు చెందాల్సిన నిధులను సక్రమంగా విడుదల చేసి గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యానికి బాటలు వేయాలని అంతా కోరుతున్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారమయ్యే వరకూ ఉద్యమం

యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు విజయరామరాజు

విజయవాడ స్వర్ణోత్సవ సభకు తరలిన నేతలు

ప్రజాశక్తి - భీమవరం




విజయవాడ బయలుదేరుతున్న ఉపాధ్యాయులు, నాయకులు

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారమయ్యే వరకూ ఉద్యమాన్ని కొనసాగిస్తామని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు స్పష్టం చేశారు. విజయ వాడలో ఆదివారం నుంచి ప్రారంభం కానున్న యుటిఎఫ్ 50 ఏళ్ల స్వర్ణోత్సవాల సభకు భీమవరం రూరల్, టౌన్, పాలకోడేరు, కాళ్ల, ఉండి మండలాల నుంచి మూడు బస్సుల్లో సుమారు 150 యుటిఎఫ్ నేతలు, ఉపాధ్యాయులు తరలి వెళ్లారు. భీమవరం యుటిఎఫ్ జిల్లా కార్యాలయం వద్ద విజయవాడ వెళ్లే బస్సులను జిల్లా అధ్యక్షులు విజయరామరాజు జెండా ఊపి ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. 49 ఏళ్ల యుటిఎఫ్ ప్రస్థానంలో అనేక ఆటుపోట్లు అధిగమించి ఉద్యమ ప్రస్థానంలో ముందుకు సాగు తుందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో యుటిఎఫ్ కీలక పాత్ర పోషిం చిందని పేర్కొన్నారు. బతికలేని బడిపంతులు నుంచి ఉన్నత స్థాయి ఉద్యోగిగా తీర్చిదిద్దడంలో యుటిఎఫ్ పాత్ర అమోఘ మన్నారు. నేడు ప్రభుత్వాలు సంఘాలను, హక్కు లను హరించే విధంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. అసెంబ్లీలో జిపిఎస్ బిల్లు ప్రవేశపెట్టి ఏకపక్షంగా ఆమోదించడం అత్యంత దుర్మార్గమన్నారు. సిపిఎస్‌ను రద్దు చేస్తామని చెప్పిన సిఎం జగన్ హామీలను మరిచి ఉద్యోగ, ఉపాధ్యాయులపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నా రన్నారు. జిపిఎస్‌ను రద్దు చేసేవరకూ యుటిఎఫ్ పోరాటం కొనసాగిస్తుందని పేర్కొన్నారు. యుటిఎఫ్ జిల్లా కోశాధికారి సిహెచ్.పట్టాభి రామయ్య, జిల్లాకార్యదర్శులు సాయిరామ్, కుమారబాబ్జి, డి.ఏసుబాబు, కెవిస్.రామకృష్ణప్రసాద్, బిజెవిడి.రాజ్యలక్ష్మి, రాష్ట్ర కౌన్సిలర్ జివివి.రామానుజరావు, మండల నాయకులు బి.నాగబాబు, బి.లక్ష్మీనారాయణ, బిఆర్‌ఎంకె.స్వామి, కె.త్రిమూర్తులు, పి.రాజబాబు, సీనియర్ నాయకులు పి.సీతారామరాజు, శ్రీరంగరాజు, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

3న బ్లాక్ డేను జయప్రదం చేయండి

రైతు, కార్మిక సంఘాల పిలుపు

ప్రజాశక్తి - భీమవరం



విజయవాడ బయలుదేరుతున్న ఉపాధ్యాయులు, నాయకులు

రైతు, కార్మిక సంఘాల దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఈనెల మూడో తేదీన జిల్లాలో అన్ని మండలాల్లో నిర్వహించే బ్లాక్ డేను జయప్రదం చేయాలని రైతు కార్మిక సంఘాల సమావేశం పిలుపునిచ్చింది. స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆదివారం జరిగిన ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల హరే రామ్ మాట్లాడారు. రైతులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు నల్ల చట్టాలను రద్దు చేయాలని, కనీస మద్దతు ధరలకు చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ నాడు దేశవ్యాప్తంగా ఢిల్లీ నడిబొడ్డులో ఏడాది పాటు వివిధ రూపాల్లో ఆందోళనలు చేపట్టారన్నారు. దీంతో రైతులకు క్షమాపణ చెబుతూ ప్రధాని మోడీ నల్ల చట్టాలను రద్దు చేస్తామని, రైతులు పండించిన ధాన్యానికి కనీస మద్దతు ధర కోసం చట్టం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ హామీ నేటి వరకూ అమలు కాలేదని విమర్శించారు. ఆ రైతాంగ పోరాటం సందర్భంగా లఖింపూర్‌ఖేరీ ఘటనలో కేంద్ర హోం శాఖ మంత్రి అజయ్ మిశ్రా కుమారుడు అసితోష్ మిశ్రా రైతులపైకి వాహనాన్ని నడిపి నలుగురి ప్రాణాలు తీసిన ఘటనలో నేటికీ ఆ మంత్రిని బర్తరఫ్ చేయడం కానీ, అతని కుమారుణ్ని శిక్షించడం గాని జరగలేదన్నారు. కేంద్ర ప్రభుత్వానికి రైతాంగం మీద ఏమాత్రం గౌరవం ఉన్నా తక్షణం ఎంఎస్‌పికి చట్టం చేయాలని, రైతుల ప్రాణాలు తీసిన కేంద్రమంత్రి కుమారుడుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా దేశవ్యాప్తంగా ఈనెల మూడో తేదీన బ్లాక్ డే నిర్వహించాలని అఖిలభారత కమిటీల పిలుపులో భాగంగా జిల్లాలోని అన్ని మండలాల్లోనూ బ్లాక్ డేని నిర్వహించి కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాలను ప్రజల ముందు ఉంచుతామన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్ రాయ్ మాట్లాడుతూ రైతాంగ పోరాటాలకు కార్మిక సంఘాలు సంఘీభావం తెలుపుతూనే వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ ఆవిర్భావ కార్యక్రమం ఈ నెల మూడో తేదీన నిర్వహిస్తామన్నారు.

కార్మిక చట్టాలను కోడ్లుగా మార్చి బిజెపి నిర్వీర్యం చేసిందని, ఉద్యోగాలు కల్పిస్తామన్న వాగ్దానాన్ని తుంగలో తొక్కి లక్షలాది మంది నిరుద్యోగాలు మారడానికి కారణమైన మోడీ విధానాలను నిరసిస్తూ ఈ ఆందోళన నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు, ఎఐటియుసి జిల్లా నాయకులు చెల్లబోయిన రంగారావు, ఫార్వర్డ్ బ్లాక్ రైతు సంఘం నాయకులు దండు శ్రీనివాస్‌రాజు, సిఐటియు నాయకులు ఎం ఆంజనేయులు పాల్గొన్నారు.

పాలకులకు సుందరయ్య ఆదర్శం

స్మారక స్తూపం ప్రారంభంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - తణుకు రూరల్



సుందరయ్య స్తూపం ఆవిష్కరిస్తున్న నాయకులు

నాడు సుందరయ్య తన ఆస్తిని పేదలకు పంచితే నేటి పాలకులు ప్రజల సంపదను దోచుకుంటున్నారని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు విమర్శించారు. ఆదివారం తణుకు మండలం వేల్పూరు బైపాస్ రోడ్‌లో నిర్మించిన పీడిత ప్రజల ఆశాజ్యోతి, స్వాతంత్ర సమరయోధులు పుచ్చలపల్లి సుందరయ్య స్మారక స్తూపాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సభకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చినవీరభద్రరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ పేదలపై భారాలు మోపుతూ కార్పొరేట్లకు రూ.కోట్లు దోచిపెడుతున్నారని విమర్శించారు. నాడు సుందరయ్య పార్లమెంట్‌లో ప్రజల సమస్యలను లేవనెత్తి బయట ప్రజాపోరాటాలు నిర్వహించే వారన్నారు. ఈ సభలో సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చాక కార్మికుల, కర్షకుల, హక్కులను, చట్టాలను కాల రాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐలు జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చాక న్యాయస్థానాలను కూడా ప్రభావితం చేస్తూ పేదలకు నష్టం చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు కౌరు పెద్దిరాజు, కె.సోమరాజు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసే విధంగా పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. శ్రామిక మహిళ జిల్లా నాయకులు ఎ.అజయకుమారి, జక్కంశెట్టి వెంకటలక్ష్మి మాట్లాడుతూ ఒకపక్క మహిళల హక్కులను హరిస్తూ మరోపక్క మహిళా బిల్లు ప్రవేశ పెట్టడం సిగ్గుచే టన్నారు. ఈ సభలో మండల కార్యదర్శి దొంగల నాగేశ్వరరావు ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ వలి, బి.చైతన్య ప్రసాద్, వాసా వెంకటేశ్వరావు, పూతినీడి పద్మ, కె.అర్జున్, వాసా పోసియ్య, కె.నరసింహారావు, రామకృష్ణ పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

స్వచ్ఛతా హి సేవ కార్యక్రమ స్ఫూర్తితో పరిసరాల పరిశుభ్రతపై పూర్తి అవగాహన కలిగి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ తోడ్పడాలని కలెక్టర్ పి.ప్రశాంతి ప్రజలను కోరారు. ఆదివారం స్థానిక అభిరుచి హోటల్ పక్కన ఉన్న గొల్లవానితిప్ప కాలువకు ఇరువైపులా ఉన్న గట్లపై ఉన్న చెత్తను తొలగించేందుకు కళాశాల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ పి.ప్రశాంతి స్వయంగా శ్రమదానంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల రెండో తేదీన గాంధీ జయంతి సందర్భంగా దేశ ప్రధాని, రాష్ట్ర ప్రభుత్వం పిలుపుతో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం ఆదివారం చేపట్టామన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, విద్యాసంస్థలు, పారిశ్రామిక ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి నిర్వహించి సంబంధిత ఫొటోలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. పారిశుద్ధ్య కార్మికులు రోడ్లు ఊడవడం లేదు, డ్రెయిన్ శుభ్రం చేయడం లేదు అనే ముందు ఒక్క క్షణం ఆలోచించి మనం చెత్తను డ్రెయిన్‌లో వేయడం, రోడ్డుమీద పారబోయడం మానుకోవాలని తెలిపారు. అనంతరం కొవ్వాడ అన్నవరం పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి అక్కడ చేపట్టిన స్వచ్ఛ తా హి కార్యక్రమాలను స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక మండలాధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్యామల, జిల్లా పంచాయతీ శాఖ అధికారి జివికె.మల్లి ఖార్జునరావు, తహశీల్దారు వై.రవికుమార్, ఎంపిడిఒ కె.వెంకటలక్ష్మి, మున్సిపల్ ఇంజనీర్ పి.త్రినాధరావు, బివి రాజు కళాశాల ప్రిన్సిపల్ రాజు, వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, వార్డు సచివాలయ సిబ్బంది, పురపాలక సంఘం సిబ్బంది, వార్డు వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

భీమవరం రూరల్: పారిశుధ్య కార్మికుల సేవలు గ్రామంలో ఆరోగ్యకరమైన వాతావరణానికి దోహదపడతాయని జిల్లా పంచాయతీ శాఖ అధికారి జివికె.మల్లిఖార్జునరావు అన్నారు. ఆదివారం భీమవరం మండలం కొవ్వాడ అన్నవరం గ్రామ సచివాలయం వద్ద స్వచ్ఛ తా హి సేవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం పారిశుధ్య కార్మికుల యోగ క్షేమాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య కార్మికులకు శానిటేషన్ కిట్లు, శాలువా కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న స్వచ్ఛ సంకల్పం క్రింద జిల్లావ్యాప్తంగా డస్ట్ బిన్లు పంపిణీ చేశామని, ప్రతీకుటుంబం ఉపయోగించుకునేలా, వాటిని మూలన పెట్టకుండా చర్యలు తీసుకో వాలన్నారు. గ్రామాల్లో తడి, పొడి చెత్త, మురుగు నీటి పారుదల నిర్వహణ తదితర అంశాలను ఎప్పటికప్పుడు పరిశీలన చేసి చర్యలు తీసుకో వాలన్నారు. క్లాప్ మిత్రాస్ అంటే ఏమిటో పారిశుద్ధ్య కార్మికులకు ఆయన వివరించారు. పరిసరాల పరిశుభ్రత పట్ల ప్రతి కుటుంబానికీ, ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు. అందరికీ ఆరోగ్యం బాగుంటేనే అభివృద్ధి సాధ్యమని, పారిశుద్ధ కార్మికులు మనస్సు పెట్టి పనిచేసి ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ ఎం.ప్రవీణ్‌కుమార్, కార్మికులు పాల్గొన్నారు.



శ్రమదానం చేస్తున్న కలెక్టర్

స్వచ్ఛభారత్ అందరి బాధ్యత : చీఫ్‌విప్ ప్రసాదరాజు



శ్రమదానం చేస్తున్న చీఫ్‌విప్ ప్రసాదరాజు

ప్రజాశక్తి - నరసాపురం

స్వచ్ఛభారత్ అనేది అందరి బాధ్యత, నిరంతర ప్రక్రియ అని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. జాతిపిత మహాత్మ గాంధీ 154వ జయంతిని పురస్కరించుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన పిలుపు మేరకు నరసాపురం పట్టణంలో ఆదివారం ఉదయం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. పట్టణంలో థామస్ బ్రిడ్జి వద్ద నుంచి రుస్తుంబాద బల్లకట్టు వంతెన వరకు జాతీయ రహదారి ఇరుపక్కల ఉన్న చెత్త చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను ఆయన అందరితో కలిసి తీశారు. ముఖ్యంగా ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా పరిశుభ్రంగా చేయాలని అందరిని ఉత్తేజపరిచారు. స్వయంగా పరిశుభ్రత కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. చీపురు పట్టుకుని శుభ్రం చేశారు. నరసాపురం ప్రధాన కాలువ గట్టు ఒడ్డున పాడవేసిన ప్లాస్టిక్ గ్లాసులను గమనించిన ఆయన వాటిని తీసేశారు. వీటికి కారకులైన షాపులవారికి నోటీసులు ఇచ్చి డస్ట్ బిన్నులు ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతిపిత మహాత్మ గాంధీ తన జీవితాంతం పారిశుధ్యానికి అపారమైన ప్రాధాన్యతను ఇచ్చేవారన్నారు. ఆయన పనులను ఆయనే స్వయంగా చేసుకునేవారన్నారు. ఆయన కన్న కళలను గ్రామ స్వరాజ్యమును మనం పాటించాలని చెప్పారు. ఆజాదీ కా అమృత్ కార్యక్రమంలో భాగంగా నాలుగేళ్లుగా ప్రధాని పిలుపుమేరకు స్వచ్ఛత హి సేవా కార్యక్రమాలను మన రాష్ట్రంలో నిర్వహించుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున నిధులు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. ఈ కీలకమైన పరిశుభ్రత కార్యక్రమంలో పరిశుభ్రమైన దేశాన్ని నిర్మించే ఈ ప్రయత్నంలో మనమందరం భాగస్వాములై పట్టణం, వార్డు గ్రామాల్లో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, మార్కెట్ యార్డు ఛైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, వార్డు కౌన్సిలర్లు, కేసరి గంగరాజు, సిర్రా కాంతమ్మ, కావలి నాని, మల్లాడి బుజ్జి, బర్రె శంకర్, గోరి సత్తిబాబు, 1 నుంచి 15 క్లస్టర్ల సచివాలయాల సిబ్బంది, వాలంటీర్లు, మున్సిపల్ సిబ్బంది, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూషకు సత్కారం

ప్రజాశక్తి - కాళ్ల

గ్రూప్-1లో రాష్ట్రస్థాయి ప్రథమ ర్యాంకు సాధించి ఏలూరు జిల్లా డిప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన గణేశ్న భాను శ్రీలక్ష్మీఅన్నపూర్ణ ప్రత్యూష ఆదివారం ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని సీసలి గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు గణేశ్న రామాంజనేయులు ఏకైక కుమార్తె ప్రత్యూష. ప్రత్యూషకు ఎంఎల్‌ఎ మంతెన రామరాజు చిరు సత్కారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గణేశ్న రామాంజనేయులు, ఉష, మాజీ సర్పంచి కత్రేడ్డి శ్రీనివాసరావు, మాజీ ఉప సర్పంచి తోట పణిబాబు, గణేశ్న నల్ల శ్రీను, ఎంపిటిసి మాజీ సభ్యులు కత్రేడ్డి విజయలక్ష్మి పాల్గొన్నారు.



ప్రత్యూషను సత్కరిస్తున్న మంతెన రామరాజు



బీచ్‌లో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

మొగల్తూరు బీచ్‌లో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్‌లో ఆదివారం పర్యాటకలతో సందడి నెలకొంది. పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు సుదూర ప్రాంతాల బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డుకు కొట్టుకువస్తున్న కెరటాలతో ఇసుక తెన్నెలపై ఆటలాడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలు దర్శించుకుని సరివి కొబ్బరి తోటల్లో సహపంక్తి భోజనాలు చేశారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించండి

నిర్మాణ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రమణరావు

ప్రజాశక్తి - ఆకివీడు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను వీడనాడాలని, వైసిపి ప్రభుత్వం నిలుపుదల చేసిన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునర్ధించాలని కార్మిక సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు నారమిల్లి రమణరావు డిమాండ్ చేశారు. ప్రభుత్వం వాడుకున్న రూ.రెండు వేల కోట్ల సంక్షేమ నిధిని తిరిగి బోర్డుకు జమ చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో రాగు సత్తిబాబు అధ్యక్షతన నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్ల కాలంగా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలు నిలుపుదల చేస్తూ 12, 14 మెమోలు ఇచ్చారన్నారు. ఆ మెమోలను రద్దుచేసి కార్మికుల సంక్షేమ పథకాల అమలు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం 1996లో రాజ్యాంగ బద్ధంగా ఏర్పడిన కార్మికుల సంక్షేమ బోర్డు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయకుండా మతతత్వంతో కార్మికులను చీలుస్తున్నారన్నారు. అందులో భాగంగానే విశ్వకర్మ బీమా యోజన పథకాన్ని ప్రవేశపెట్టారని, ఈ పథకం అమలు కోసం కార్మిక శాఖ కార్యాలయానికి అప్పగించాలని కోరారు. ఈ సమావేశంలో నూకల సత్తిబాబు, చిలక సురేష్, బి.ఆదాము, కె.ధనరాజ్, కె.మనోహర్, శంకర్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే జగన్ లక్ష్యం : డిసిసిబి ఛైర్మన్ పివిఎల్

ప్రజాశక్తి - ఉండి

గ్రామాలాభివృద్ధే లక్ష్యంగా సిఎం జగన్ పరిపాలన కొనసాగిస్తున్నారని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు అన్నారు. మండల ంలోని పాములపర్రులో నూతనంగా నిర్మించే సీసీ రోడ్లకు, డ్రెయినేజీలకు శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లుగా సిఎం జగన్ పరిపాలన కొనసాగిస్తున్నారన్నారు. గ్రామ అభివృద్ధి కోసం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తి చేసిన ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. పాములపర్రు సచివాలయానికి కేటాయించిన రూ.20 లక్షల నిధులు, మండల పరిషత్ నిధులు రూ.6 లక్షలు, జిల్లా పరిషత్ నిధులు రూ.5లక్షలు మొత్తం రూ.31 లక్షలతో పాములపర్రులో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించనున్నట్లు తెలిపారు. గ్రామ సర్పంచి కేసన శాంతికుమారి బలుసులరావు మాట్లాడుతూ తమ గ్రామానికి మండల పరిషత్ జిల్లా పరిషత్ నిధులు కేటాయించిన ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, రణస్థల కనకదుర్గ మహంకాళిలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, గ్రామ మాజీ సర్పంచులు నక్క చెన్నకేశవరావు, తాటిపర్తి పెదవీరప్ప, గ్రామ పార్టీ అధ్యక్షులు వర్రే ముసలయ్య, దానం విద్యాసాగర్ పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న పివిఎల్


పేరుపాలెం బీచ్‌లో ఇద్దరు గల్లంతు

ఒడ్డుకు కొట్టుకొచ్చిన ఒకరి మృతదేహం

మరొకరి కోసం గాలింపు

ప్రజాశక్తి - మొగల్తూరు

పేరుపాలెం బీచ్‌లో ఆదివారం ఇద్దరు యువకులు గల్లంతయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రామన్నపాలెం పంచాయతీ ఆకనవారితోటకు చెందిన పది మంది యువకులు ఆదివారం మధ్యాహ్నం సమయంలో పేరుపాలెం బీచ్‌కు వెళ్లారు. వారిలో కొంతమంది సముద్ర స్నానానికి దిగారు. అలాల ఉధృతికి ఆకన సత్యప్రసాద్, కొమ్ముల శ్రీరామచంద్రమూర్తిలు గల్లంతయ్యారు. మద్దుల సాయిని స్థానికులు రక్షించి ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. గల్లంతైన ఇద్దరిలో ఆకన సత్యప్రసాద్(18) మృతదేహం తీరానికి కొట్టుకొచ్చింది. శ్రీరామచంద్రమూర్తి కోసం గాలిస్తున్నారు. సత్యప్రసాద్ పదో తరగతి ఉత్తీర్ణత సాధించి తండ్రికి వ్యవసాయ పనుల్లో సహకరిస్తున్నాడు. శ్రీరామచంద్రమూర్తి నరసాపురంలోని ఓ ప్రయివేట్ కాలేజీలోబీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



చెక్కు అందిస్తున్న ఆదిశేషరావు

మానవత విద్యానిధికి రూ. 25 వేలు విరాళం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లుకు చెందిన అత్యం ఆదిశేషారావు తన తల్లిదండ్రులు కీర్తిశేషులు అత్యం సుబ్బారావు, వసంత కనక కామేశ్వరమ్మ జ్ఞాపకార్థం మానవత విద్యానిధికి రూ.25 వేల విరాళం అందించారు. పాలకొల్లు మండల కోశాధికారి మద్దాల వాసుకు ఆదివారం చెక్కు అందించారు. పాలకొల్లు మండల కన్వీనర్ ముత్యాల రామారావు మాట్లాడుతూ ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఉన్నత విద్యాభ్యాసానికి సహకరించేందుకు మానవత విద్యానిధి ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పట్టణ అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్, రేపూరి సూర్యనారాయణ, విన్నకోట వెంకటరమణ, బేబి పాల్గొన్నారు.

నిశాంత్‌వర్మకు ఎడ్యు ప్రెన్యూర్ అవార్డు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఎస్ఆర్‌కెఆర్ సెక్రటరీ, కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మకు టైమ్స్ బిజినెస్ అవార్డ్సులో భాగంగా యంగ్ ఎడ్యుప్రెన్యూర్ అవార్డు ప్రకటించింది. కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణమరాజు నిశాంతవర్మకు బదులుగా విజయవాడలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతిరాజు ఆదివారం మీడియాకు వివరాలు తెలిపారు. విదేశాల్లో అత్యున్నతమైన విద్య అభ్యసించి వచ్చి కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్‌గా బాధ్యతలు చేపట్టి సంస్థను దేశంలోనే ప్రముఖ విద్యాసంస్థగా తీర్చిదిద్దటంలో నిశాంత్ వర్మ మంచి కృషి చేస్తున్నారని చెప్పారు. ఆయన హయాంలో ఎఐసిటిఇ కళాశాలకు ఐడియా ల్యాబ్ గతేడాది మంజూరు చేసిందన్నారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం అటల్ ఇన్నోవేషన్ కమ్యూనిటీ సెంటర్ కూడా మంజూరు చేసిందన్నారు. ఇటీవల ఆయన ఆధ్వర్యంలో అమెరికాలో సుమారు 600 మంది పూర్వ విద్యార్థులతో ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల అలు మిని అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (సానా) పేరిట న్యూ జెర్సీలో పెద్దఎత్తున పూర్వ విద్యార్థుల సదస్సు కూడా జరిగిందన్నారు. కళాశాలను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించడంలో విద్యావేత్తగా నిరంతరం శ్రమిస్తున్న నిశాంతవర్మకు కళాశాల యాజమాన్యం, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ అభినందనలు తెలిపింది.

సర్పంచి జగ్గరాజుకు మాతృవియోగం

ప్రజాశక్తి - కాళ్ల

సర్పంచి భూపతిరాజు వెంకట జగ్గరాజు మాతృమూర్తి భూపతిరాజు వెంకట నరసయ్యమ్మ (90) ఆదివారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమెకు ఐదుగురు సంతానం. నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు భూపతిరాజు వెంకట జగ్గరాజు గ్రామ సర్పంచిగా పని చేస్తున్నారు. ఎంపిటిసి సభ్యులు చిన్నపరపు రాంబాబు, రాష్ట్ర రైతు కార్యచరణ సమితి కోశాధికారి మంతెన వెంకట రవివర్మ, మంతెన రామకృష్ణంరాజు, వైసిపి గ్రామ అధ్యక్షుడు దాట్ల శ్రీనివాసరాజు, స్కాట్లండ్ సెక్యూరిటీ వాసు రాజు నరసయ్యమ్మ మృతికి తెలిపారు.



సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎంపిపి

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - వీరవాసరం

విభేదాలు పక్కనపెట్టి భేదాలు చూపకుండా అభివృద్ధి పనులు పూర్తి చేయడమే అర్థవంతమైన రాజకీయాలకు నిదర్శనమని ఎంపిపి వీరవల్లి దుర్గాభవాణి అన్నారు. దూసనపూడిలో చేపట్టబోయే రెండు సీసీ రహదారుల పనులను ఎంపిపి ఆదివారం ప్రారంభించారు. ఈ రెండు రహదారులను మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2.90 లక్షలతో సీసీ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. మండలంలో కొన్ని పంచాయితీలకు మండల పరిషత్ నిధులు కేటాయించినా పనులు చేపట్టేందుకు సర్పంచులు ఆసక్తి చూపకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి యర్రంశెట్టి నాగసాయి, మాజీ సర్పంచి దాడి కాశీ, వైస్ ఎంపిపి చిలకపాటి ప్రకాశం, గుండా రామకృష్ణ పాల్గొన్నారు.

యాత్రికులతో ముత్యాలమ్మ ఆలయం రద్దీ

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో ఉన్న బండి ముత్యాలమ్మ ఆలయం యాత్రికులతో ఆదివారం కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భజన కాలక్షేపం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు. ప్రసాద వితరణ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

నేరాలు - ఘోరాలు

వ్యాన్ ఢీకొని వృద్ధుడు మృతి


ప్రజాశక్తి - మొగల్తూరు

జాతీయ రహదారిపై స్థానిక కొండావారిపాలెం సమీపంలో రోడ్డు దాటుతుండగా వ్యాన్ ఢీకొనడంతో వృద్ధుడు మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... స్థానిక దయదాస్‌పేటలో నివాసముంటున్న విశ్రాంత ఎంఇఒ పిట్ట సూర్యచంద్రరావు (68) ఆదివారం ఉదయం కొండావారిపాలెంలోని చర్చికి వెళ్లేందుకు జాతీయ రహదారి దాటుతున్నాడు. ఈ క్రమంలో వ్యాన్ ఢీ కొనడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికులు అతడిని 108లో నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం భీమవరంలోని ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు.

వృద్ధులను గౌరవించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

వయోవృద్ధులను ఇబ్బంది పెట్టేవారికి ఇబ్బందులు తప్పవని కలెక్టర్ పి.ప్రశాంతి హెచ్చరించారు. భీమవరం బ్యాంక్ కాలనీలోని శ్రీకృష్ణదేవరాయ సాంస్కృతిక సమితి భవనంలో వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం కార్యక్రమానికి కలెక్టర్ పి.ప్రశాంతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వయోవృద్ధుల పట్ల గౌరవంగా ఉండం పిల్లలకు నేర్పించాలన్నారు. వయోవృద్ధులు వచ్చేతరానికి ఆదర్శమన్నారు. అనంతరం వయోవృద్ధులను కలెక్టర్ సన్మానించి మెమోంటో, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఎడి జిసిహెచ్.ప్రభాకర్, అప్పిలేట్ ట్రిబ్యునల్ మెంబర్ దుర్గాప్రసాద్, భీమవరం డివిజన్ సీనియర్ సిటిజన్ ట్రిబ్యునల్ అధికారి చంద్రాజీ, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు అడ్డాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి చిట్టి వెంకయ్య, రాష్ట్ర జనరల్ సెక్రటరీ కె.రామచంద్రరావు పాల్గొన్నారు.



వయోవృద్ధులను సత్కరిస్తున్న కలెక్టర్

ఆకివీడు : పెంచి పెద్ద చేసి మన జీవితానికి ఉన్నత మార్గాన్ని చూపిన తల్లిదండ్రుల సేవలో జీవితాన్ని ధన్యం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మహేశ్వరరావు అన్నారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా ఆదివారం లయన్స్ క్లబ్ సహకారంతో స్థానిక లయన్స్ హాలులో ఆకివీడు మండల సర్ ఆర్థర్ కాటన్ వృద్ధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ గౌరవాధ్యక్షులు డాక్టర్ ఎంవి.సూర్యనారాయణరాజు అధ్యక్షతన నిర్వహించిన సభలో మహేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వృద్ధులకు సేవలందించేందుకు వైద్య సిబ్బంది ఇంటింటికి వస్తుంటారని, వారి సేవలను ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని ఆయన కోరారు. సభలో సంఘ అధ్యక్షులు బొబ్బిలి బంగారయ్య మాట్లాడుతూ తమ సంఘాన్ని స్థాపించి 13 ఏళ్లయిందన్నారు. ఈ కాలంలో సుమారు వంద సదస్సులు నిర్వహించామని చెప్పారు. ప్రతి సదస్సులను వంద మందికి భోజనాలు, దుప్పట్లు, బట్టలు అందిస్తున్నామన్నారు. ఎండి మస్లే వృద్దీన్‌బాషా వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుల సహకారంతో 50 మంది పేద మహిళలకు చీరలు, 50 మంది పురుషులకు పంచెలు, వంద మందికి భోజనాలు అందించారు. అనంతరం ఆరుగురు వృద్ధులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు వివి.కృష్ణంరాజు, ఆదర్శ లయన్స్ క్లబ్ అధ్యక్షులు మోటుపల్లి శ్రీనివాస్, కోశాధికారి జిక్కి అహ్మద్, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆక్వా అధ్యక్షులు గుర్రం అరవింద్, వైద్య ప్రముఖులు మహేష్ వర్మ, డాక్టర్ బిలాల్, మాధవి, దాత రియాజుద్దీన్ పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ :వయోవృద్ధుల హక్కుల పరిరక్షణకు న్యాయస్థానాలు, చట్టాలు కట్టుబడి ఉన్నాయని, వారికి ఉచిత న్యాయ సహాయం అవసరమైతే మండల న్యాయ సేవా సంస్థను సంప్రదించాలని నరసాపురం సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు అన్నారు. అంతర్జాతీయ సీనియర్ సిటిజన్స్ డే సందర్భంగా మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు చల్లా దానయ్యనాయుడు, సంస్థ సభ్యులు యర్రంశెట్టి దేవేంద్ర ఫణికర్, సీనియర్ న్యాయవాది నారిన శ్రీనివాసరావు, అసోసియేషన్ అధ్యక్షులు ఎ.హరినాధకృష్ణ పాల్గొన్నారు.

పాలకొల్లు :సమాజంలో వివిధ సేవలు చేసిన వృద్ధులను ఆదుకోవడం కనీస ధర్మమని వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ చెప్పారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా ఆదివారం పాలకొల్లు మున్సిపల్ కార్యాలయం వద్ద రాహుల్ సామాజిక సేవ సంస్థ అధ్యక్షులు జోగాడ ఉమామహేశ్వరావు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వంద మంది వృద్ధులకు పండ్లు, దుప్పట్లు ఆయన చేతులమీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేతలు గుణ్ణం నాగబాబు, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, టౌన్ ప్రెసిడెంట్ చందక సత్తిబాబు, జోగి వెంకటేశ్వరరావు, జోగి వడ్డికాసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధిని పార్టీ నాయకులు, కార్యకర్తలు, నూతనంగా ఏర్పడిన కమిటీలు ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. వైసిపి భీమవరం పట్టణ అధ్యక్షులుగా నియమితులైన తోట భోగయ్య ఆదివారం ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్‌ను స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ భోగయ్యను అభినందించి మాట్లాడారు. సిఎం జగన్ ప్రజా బంధువని, సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా చేసుకుని రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ ప్రజల గుండెల్లో సిఎం జగన్ చోటు సంపాదించుకున్నారన్నారు. మహాత్మ గాంధీ ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వాన్ని ఇంటి ముంగిటకు తీసుకొచ్చేందుకు వాలంటీర్ వ్యవస్థను, సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. పట్టణ అధ్యక్షులుగా నియమితులైన తోట భోగయ్యను పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందించారు. ఈ సందర్భంగా భోగయ్య మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. పార్టీని మరింత బలోపేతం చేసే విధంగా కష్టపడి పని చేస్తానని చెప్పారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

ప్రజాశక్తి - భీమవరం రూరల్

స్వచ్ఛ ఆంధ్రగా తీర్చిదిద్దేందుకు రాష్ట్రంలోని పౌరుల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. పట్టణంలో చేపట్టిన స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు పాల్గొని స్వచ్ఛతా కార్యక్రమాలను విద్యార్థులతో కలిసి స్వయంగా నిర్వహించారు. తొలుత 11వ వార్డు బిఎన్.రోడ్డు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం సెంటర్ వద్ద స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం 33వ వార్డు అభిరుచి హోటల్ ఎదుట గొల్లవానితిప్ప కెనాల్ వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులతో కలిసి స్వచ్ఛత శ్రమదానాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం కమిషనర్ ఎం.శ్యామల, తహశీల్దార్ వై.రవికుమార్, ఎంపిడిఒ కె.వెంకటలక్ష్మి, మున్సిపల్ ఇంజినీరు పి.త్రినాథరావు, వార్డు నాయకులు, వార్డు సచివాలయ సిబ్బంది, పురపాలక సంఘం సిబ్బంది, వార్డు వాలంటీర్లు, పట్టణంలోని పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



కాళ్ల : కలవపూడిలో స్వచ్ఛతా హి ర్యాలీ

పరిసరాల శుభ్రత అందరి బాధ్యతని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని ఆదివారం రెండో పట్టణంలోని ఎస్ఆర్ నగర్‌లో ఉన్న పార్కులో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ కొడవలితో పార్కులో మొలిచిన గడ్డిని కోసి మున్సిపాలిటీ డస్ట్‌బిన్‌లలో వేశారు. అనంతరం చీపురుతో పార్కును శుభ్రపరిచారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో భీమవరం ఆర్‌డిఒ దాసిరాజు, వైసిపి సీనియర్ నాయకులు గోకరాజు రామం, ఎంపిపి విజయనరసింహరాజు, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, తహశీల్దార్ వై.రవికుమార్ పాల్గొన్నారు.

కాళ్ల :పరిసరాల పరిశుభ్రత తప్పనిసరిగా పాటిస్తే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమవుతుందని కలవపూడి సర్పంచి జాన్ అన్నారు. మండలంలోని కలవపూడిలో స్వచ్ఛతా హి సేవ ర్యాలీ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి జాన్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు సహకారం అందించాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి, ఉప సర్పంచి భట్రాజు వాసు, కార్యదర్శి ఎం.అనూష, విఆర్‌ఒ కెనడి, హైస్కూల్ ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు సనగన సత్యనారాయణ పాల్గొన్నారు.

పెనుమంట్ర : నివాస ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపిడిఒ పి.పద్మజ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో, పాఠశాల, పంచాయతీల పరిధిలోని ప్రధాన కూడళ్లలో, ఆసుపత్రి, ప్రభుత్వ కార్యాలయం ఆవరణలో ఆదివారం అధికారులు స్వచ్ఛత హి సేవ కార్యక్రమం నిర్వహించారు.

పాలకొల్లు రూరల్ :మండలంలోని లంకలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌పి రవిప్రకాష్ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పరిశుభ్రత ఆరోగ్యానికి కారణమన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి మనోహరా చారి, రూరల్ సిఐ కుడిపూడి సతీష్, రూరల్ ఎస్ఐ ఎస్.శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జెబిజె.ప్రసాద్‌రావు, లంకలకోడేరు పంచాయతీ కార్యదర్శి డి.శ్రీనివాస్, మహిళా పోలీసులు, పంచాయతీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వీరవాసరం : స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం వివిధ శాఖాధికారులు శ్రమదానం చేశారు. ఈ శ్రమదానంలో భాగంగా పారిశుధ్య పనులు, చెత్తను ఎత్తడం వంటి పనుల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. వీరవాసరం సర్పంచి చికిలే మంగతాయారు ఆధ్వర్యంలో వీరవాసరం ఎంఆర్‌కె.హైస్కూల్, జాతీయ రహదారి వెంబడి అపారిశుధ్య పరిసరాలను శుభ్రం చేయడం, వీధులు ఊడ్చడం వంటి పనులు చేశారు. తహశీల్దార్ ఎం.సుందరరాజు ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం పరిసరాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సత్యనారాయణరాజు, సర్వేయర్లు శైలజ, కాటం శ్రీనివాసరావు, పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

గణపవరం :స్వచ్ఛభారత్ అభియాన్ పిలుపులో భాగంగా ఆదివారం మండలంలో ఉన్న 25 పంచాయతీల్లో శ్రమదానాలు జరిగినట్లు ఇఒపిఆర్‌డి టివి.సత్యనారాయణ చెప్పారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీల్లో చెత్త చెదారాలను తొలగించారు. మంచినీటి చెరువుల చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి చెరువులను శుభ్రం చేశారు. రహదారుల పక్కన ఉన్న చెత్త పోగులను తొలగించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని గణపవరం సర్పంచి మూరా అలంకారం అన్నారు. ఆదివారం నిర్వహించిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో అలంకారం మాట్లాడుతూ గ్రామంలో వీధులన్నీ చెత్త చెదారాలు లేకుండా పరిశుభ్రంగా ఉంచుకుంటే ప్రజల ఆరోగ్యాలు బాగుంటాయన్నారు. ప్రభుత్వం పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. పంచాయతీ సిబ్బందితోపాటు కలిసి వీధులన్నీ శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డిఎస్ఆర్.ప్రసాద్, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొల్లు : పాలకొల్లు ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్-3 యూనిట్ల వాలంటీర్లు పాలకొల్లు రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ మాస్టర్ రామలింగేశ్వరరావు మాట్లాడుతూ ఛాంబర్స్ కళాశాల వారు పట్టణంలో సేవ చేయడం అభినందనీయమన్నారు. కళాశాల ఛైర్మన్ కెవిఆర్.నరసింహరావు మాట్లాడుతూ విద్యార్థులు సేవ చేస్తూ ఇతరులకు ఆదర్శంగా ఉండాలని చెప్పారు. కరస్పాండెంట్ కె.రామరాజు మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ అన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు ఇలా సేవా దృక్పథంతో ఉండడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు కె.రాంబాబు, టి.రాధా మాధవి, వి.సామ్యూల్ పాల్గొన్నారు. పాలకొల్లు శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానంలో కలెక్టర్, దేవాదాయశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కోరాడ శ్రీనివాస్, ఇఒ యాళ్ల సూర్యనారాయణ, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

ఆచంట : పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణమవుతుందని ఎంపిపి ఛైర్మన్ చిల్లే లావణ్య అన్నారు. మండలంలోని ఆచంట కొడమంచిలి, పెదమల్లం, కోడేరు, కరుగోరుమిల్లి, కందరవల్లి, వల్లూరు, పెనుమంచిలి, ఆచంట వేమవరం, శేషమ్మ చెరువు, అయోధ్యలంక, ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలు ఆయా గ్రామ సర్పంచులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాలను పరిశుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కోట సరోజినీ వెంకటేశ్వరరావు, సుంకర సీతారాం, జక్కంశెట్టి చంటి, నేలపూడి బేబిరామ్మోహన్‌రావు, గణేశుల శేషవాణి సుబ్బారావు, అల్లం పద్మావతి, గుబ్బల మాధవరావు, దిరిశాల విజయలక్ష్మి, జక్కంశెట్టి శ్రీరాములు, పంచాయతీ కార్యదర్శులు జివివి.సత్యనారాయణ, నరసింహరావు, డి.నాని పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెంలో ముందుగా గుర్తించి ఎంపిక చేసుకున్న 125 పాయింట్లలో సుమారు 1500 మంది శ్రమదానంలో పాల్గొన్నారు. చెత్తాచెదారాలను శుభ్రం చేసి ఆ 125 పాయింట్లను పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. తాడేపల్లిగూడెం ఆర్‌డిఒ కె.చెన్నయ్య, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ కర్రి భాస్కరరావు, అధికారులు, వార్డు ఇన్‌ఛార్జులు, వాలంటీర్లు, కన్వీనర్లు, సచివాలయ ఉద్యోగులు శ్రమదానంలో పాల్గొన్నారు.

పెనుగొండ : పెనుగొండ సర్పంచి నక్కా శ్యామలాసోని ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపిడిఒ శ్రీనివాస్ దొర పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టుపై కొనసాగిన నిరసనలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

చంద్రబాబు అరెస్టుపై టిడిపి భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి, పార్టీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి అధ్యక్షతన పట్టణంలో నిర్వహిస్తున్న రిలే నిరాహారదీక్ష శిబిరాన్ని ఆదివారం మాజీ ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు, టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మెంటే పార్థసారధి మాట్లాడుతూ టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టులో వైసిపి ప్రభుత్వం రాజ్యాంగ వ్యతిరేకంగా వ్యవహరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రేవు వెంకన్న, గూడూరి సుబ్బారావు, గంటా త్రిమూర్తులు, ఏసుపాదం, చిన్ని, చల్లబోయిన, సుబ్బారావు, జంపన ధనరాజ్, విజ్జురోతు రాఘవులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం మహా పాదయాత్రకు హాజరు కావొద్దని భీమవరం పోలీసులు టిడిపి నాయకులకు నోటీసులు అందించారు. తోట సీతారామలక్ష్మి, మెంటే పార్థసారథి, వేండ్ర శ్రీనివాస్, గంట త్రిమూర్తులు, ఉప్పులూరి చంద్రశేఖర్, మైలాబత్తుల ఐజాక్ బాబు, లంకి చిన్ని, విజ్జురోతు రాఘవులు, పలువురు నాయకులకు నోటీసులు జారీ చేశారు.

ఆచంట : చంద్రబాబు అరెస్టుపై నిరసనగా ఆచంటలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 18 రోజు ఆదివారం కొనసాగాయి. ఈ సందర్భంగా దీక్షను ఉద్దేశించి మాజీ మంత్రి పితాని సత్యనారాయణ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతూ ప్రతిపక్షాలు లేకుండా చేయాలనే ఉద్దేశంతో సిఎం ఇసుక, లిక్కర్ మాఫియాలకు పాల్పడుతూ రాష్ట్రాన్ని దోచుకుంటున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, జెడ్‌పిటిసి సభ్యులు ఉప్పలపాటి సురేష్‌బాబు, పార్టీ మండలాధ్యక్షులు కేతా మీరయ్య పాల్గొన్నారు.

పాలకొల్లు : పాలకొల్లు గాంధీ బొమ్మ సెంటర్ వద్ద చేపట్టిన నిరసన దీక్షలు ఆదివారంతో 19వ రోజుకు చేరుకున్నాయి. స్వర్ణకారులు దీక్షలో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు మద్దతు తెలిపారు. మాజీ మంత్రి పితాని సత్యనారాయణ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం :చంద్రబాబు అరెస్టుపై నిరసనగా తాడేపల్లిగూడెంలో టిడిపి నేతలు నిరసన ప్రదర్శన చేశారు. పట్టణ, గ్రామీణ సిఐలతో పాటు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 12 మంది ఎస్ఐలు డిఎస్‌పి శ్రీనాథ్, సుమారు వందమంది పోలీస్ సిబ్బంది గొర్రెల సూరన్న కాంప్లెక్స్ వద్ద మోహరించారు. జిల్లా నలుమూలల నుంచి టిడిపి నాయకులు కార్యకర్తలు గొర్రెల సూరన్న కాంప్లెక్స్ వద్దకు తరలివచ్చారు. బైపాస్ రోడ్డు నుంచి వస్తున్న తణుకు, కొవ్వూరు, నిడదవోలు, ఉంగుటూరు నియోజకవర్గాలకు చెందిన మాజీ ఎంఎల్ఎలు ఆరిమిల్లి రాధాకృష్ణ, జవహర్, శేషారావు, గన్ని వీరాంజనేయులును పోలీసు ఉన్నతాధికారులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసు ఉన్నతాధికారులు, నాయకుల మధ్య తోపులాట జరిగింది. సుమారు అర కిలోమీటర్ మేర పాదయాత్ర సాగింది. ర్యాలీ ప్రారంభమైన కొన్ని నిమిషాలకు ఏలూరు మాజీ ఎంపీ మాగంటిబాబు ర్యాలీలో కలిసి నినాదాలు చేస్తూ ఎస్‌విఆర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. ర్యాలీ ఎస్‌వి రంగారావు సర్కిల్ చేరే సమయానికి గృహ నిర్బంధంలో ఉన్న టిడిపి తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి అక్కడకు చేరుకున్నారు. తాడేపల్లిగూడెం పట్టణ, గ్రామీణ అధ్యక్షులు, వివిధ శాఖల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పట్నాల రాంపండు, పరిమి రవికుమార్, షేక్ బాజీ, పద్మనాభం మురళి, రాంప్రసాద్ చౌదరి, ముత్యాల సత్యనారాయణ, పసల కొండ పసల వెంకటాచలం, పసుమర్తి రామలక్ష్మణ్, దాసరి అప్పన్న, నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : చంద్రబాబునాయుడు అరెస్టుపై నిరసనగా తాడేపల్లిగూడెంలో చేపట్టిన నిరసన ప్రదర్శనకు భీమవరంలో పోలీసులు అనుమతి నిరాకరిస్తున్నారు. టిడిపి రాష్ట్ర నాయకులు కోశాధికారి మెంటే పాదసారథి నివాసానికి వెళ్లి పోలీసులు పలుసార్లు నోటీసులు ఇవ్వడానికి ప్రయత్నించారు. అయితే ఆయన నోటీసులు తీసుకోవడానికి నిరాకరించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్, టిడిపి నేతలు ఉప్పులూరి చంద్రశేఖర్, గంటా త్రిమూర్తులుకు పోలీసులు నోటీసులు అందించారు.

పాలకొల్లు : తాడేపల్లిగూడెంలో జరుగుతున్న టిడిపి పాదయాత్రలో పాల్గొనటానికి వెళ్తున్న ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడును పోలీసులు అడ్డుకుని పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. టిడిపి నేతలు పెచ్చెట్టి బాబు, కడలి గోపీ, వట్టం గణేష్, రాములను పోలీస్‌స్టేషన్ కు తరలించారు.

3న బ్లాక్‌డే జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - వీరవాసరం

ఈ నెల మూడో తేదీన బ్లాక్ డేను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జుత్తిగ నరసింహమూర్తి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం రైతు సంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు ఉమ్మడి సంఘాల సమావేశాన్ని లింగం సత్యనారాయణ అధ్యక్షతన వీరవాసరం సిపిఎం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడుతూ లికింపూర్‌లో కేంద్ర మంత్రి అజయ్‌మిశ్రా కుమారుడు ఆశీష్‌మిశ్రా నలుగురు రైతులు, ఇద్దరు విలేకర్ల మృతికి కారణమైనప్పటికీ నేటికీ అతనిని అరెస్టు చేయకపోవడం దుర్మార్గమన్నారు. కేంద్ర మంత్రి పదవి నుండి అతనిని తొలగించి అతని కుమారుడిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు పోతుల మృత్యంజయ, యాళ్లబండి నారాయణమూర్తి, మైగాపుల త్రిమూర్తులు, తాళ్లూరి రాము, అయినూడి బాబురావు, పాలా కోటేశ్వరావులు పాల్గొన్నారు.

ఘనంగా అల్లు రామలింగయ్య జయంతి

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు కీర్తి ప్రతిష్టలు ప్రపంచవ్యాప్తంగా తెచ్చిన హాస్య నటుడు కీర్తిశేషులు పద్మశ్రీ అల్లు రామలింగయ్య అని చిరంజీవి ఫ్యాన్స్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తులా రామలింగేశ్వరరావు అన్నారు. అల్లు జయంతి సందర్భంగా పట్టణంలోని అల్లు కాంస్య విగ్రహానికి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షులు శిడగం సురేంద్ర, ప్రధాన కార్యదర్శి కొమ్ముల దినేష్, పినిశెట్టి శ్రీనివాస్, విన్నకోట గోపీ, చేబ్రోలు కృష్ణ మోహన్, ఆచంట దీపు, అలుగు సత్తిబాబు, లంక సాయి, కాపిశెట్టి పెదకాపు, సాంబ, మునకాల అఖిల్, తిరుమాని రామకృష్ణ, పండు పాల్గొన్నారు.

3న పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని పలు గ్రామాల్లో ఈ నెల మూడో తేదీన రూ.7,52,85,000 అభివృద్ధి, శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాలు చేయనున్నట్లు ఎంపిపి కర్రి వెంకటనారాయణరెడ్డి (వాసురెడ్డి) ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆధ్వర్యంలో భట్లమగుటూరు గ్రామం పిహెచ్‌సి బిల్డింగ్ వార్డు గది, యుపి అడిషనల్ తరగతి గదులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆలమూరు గ్రామం హెల్త్ క్లినిక్ ప్రారంభం, కొయ్యేటిపాడులో హెల్త్ క్లినిక్ సెంటర్, సిసి రోడ్లు, రైతు భరోసా కేంద్రం ప్రారంభం, సత్యవరంలో సచివాలయం ప్రారంభం, నెగ్గిపూడిలో రైతు భరోసా కేంద్రం, మార్టేరు కోడేరు రోడ్డులో బస్సు షెల్టర్లు, పాలకొల్లు రోడ్డులో బస్సు షెల్టర్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా (ఉభయగోదావరి జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్) రాజంపేట ఎంపీ పార్లమెంట్ మిథున్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, రాష్ట్ర శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, అమలాపురం పార్లమెంటు సభ్యులు చింత అనురాధ, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ గంటా పద్మశ్రీ తెలిపారు.

'బిసిల అభ్యున్నతికి కృషి'

ప్రజాశక్తి - ఉండి

బిసిల అభ్యున్నతికి తమ వంతు కృషి చేస్తామని బిసి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చేబ్రోలు బాలాజీ, మండల అధ్యక్షులు అంగర రాంబాబు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బిసిల సంక్షేమానికి సిఎం జగన్ కట్టుబడి ఉన్నారన్నారు. తమను గుర్తించి పదవులు కట్టబెట్టిన జిల్లా బిసి సంఘం అధ్యక్షులు సురవరపు వెంకటాచార్యులకు, డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజులకు ధన్యవాదాలు తెలిపారు.

పాలమూరులో 'మహిళాశక్తి'

పెనుమంట్ర :మండలంలోని పాలమూరులో ఆదివారం మహిళాశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పితాని సత్యనారాయణ తనయుడు వెంకట్ మాట్లాడుతూ చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టోతో ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు తమనంపూడి శ్రీనివాసరెడ్డి (బుల్లాలు), మండల కార్యదర్శి మురళీ మోహన్‌రావు, క్లస్టర్ ఇన్‌ఛార్జి చింతపల్లి రామకృష్ణ ,పెనుమత్స వివేక్ రాఘవేంద్రరాజు పాల్గొన్నారు.

IN THE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE :: ELURU
O.S.NO.71/2015

Between:
Yelika Veeramma ...*Plaintiff*
Vs
1) Gayam Bajramma [Died] & Others ...*Defendants*

NOTICE

9) Sole Lakshmi, Wife of Srinu, Lingapalem, Lingapalem Mandal, CJCJ. WGDT. AP.

Whereas the plaintiff filed suit for partition of the plaint schedule property against the defendants The Honourable court order notice in the above 9th defendant.

Whereas as the notice addressed to the 9th defendant in the above suit could not be served as last known address and the notice could not be served;

Whereas the Honorable court ordered notice to the 9th defendant by substituted service by way of publication;

You, are hereby called upon to appear in person before this Honourable court Eluru on **09-10-2023 at 10:30 A.M.** and state your objections if any. Lest the suit will be decided exparte.

(As per court orders)
DEVULAPALLI KRISHNA SASTRY
Eluru, Advocate,
29-9-23. Eluru